సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 4 । మే । 2023



సిక్కోలు జానపదం

శ్రీకాకుళం అనేక కళారూపాలకు పుట్టినిల్లుగా నిలుస్తోంది. ఇందుకు రంగోయి గ్రామం కేంద్రంగా నిలుస్తోంది. - 8లో



డీఎస్పీలకు ఆత్మీయ వీడ్కోలు

సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్తున్న శ్రీకాకుళం, కాశీబుగ్గ డీఎస్పీలు మహేంద్ర మాతే, ఎం.శివరామిరెడ్డిలను బుధవారం ఎస్పీ సన్మానించారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	34°	23°
ఇచ్ఛాపురం	32°	22°
పాతపట్నం	32°	22°
శ్రీకాకుళం	33°	21°

న్యూస్‌రీల్

అనధికార తరగతులు నిర్వహిస్తే చర్యలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో సెలవుల్లో అనధికారికంగా తరగతులు నిర్వహిస్తే (ఫెయిలైన విద్యార్థులకు మినహా) కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు హెచ్చరించారు. బుధవారం నగరంలో తనిఖీలు చేపట్టగా కొత్తబ్యాచ్‌లకు తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలలకు తాళాలు వేశారు. భవిష్యత్తులో పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తప్పవని కళాశాలల ప్రతినిధులకు హెచ్చరించారు. జిల్లాలో అనధికార, గుర్తింపులేని ఇంటర్మీడియట్ కళాశాలలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టంచేశారు.

'ఉచిత చదువు' రెండో జాబితా ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత విద్య కోసం రెండో ఫేజ్ కింద ఎంపికైన 93 మంది విద్యార్థుల జాబితాను జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1)సీ ప్రకారం 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు నమోదు చేసుకుని లాటరీ ద్వారా ఎంపికైన విద్యార్థులు ఈ నెల 9లోగా పాఠశాలల్లో విధిగా అడ్మిషన్లు పొందాల్సి ఉంది. ఒకవేళ నిర్దేశించిన తేదీలోగా ప్రవేశం పొందకపోతే సదరు విద్యార్థుల అడ్మిషన్ రద్దు కానుంది.

ఆ ఫీజులు ప్రభుత్వమే భరిస్తుంది..

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు ప్రవేశాలు పొంది, ఉచితంగా చదువుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే తొలి విడత ప్రవేశాలు పూర్తయ్యాయి. తాజాగా రెండో విడత ఎంపికైన విద్యార్థుల జాబితా మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో నోటీసు బోర్డులో సిద్ధంగా ఉన్నాయి. ఈ చదువుకు అవసరమైన ఫీజులను ఆయా పాఠశాలలకు ప్రభుత్వమే చెల్లించనుంది. ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది.

వెబ్‌పోర్టల్లోనూ జాబితా: డీఈఓ

జాబితాను ఎంఈవో కార్యాలయాలతో పాటు సీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో అందుబాటులో ఉంచామని డీఈఓ తిరుమల చైతన్య బుధవారం తెలిపారు. తల్లిదండ్రులకు సమాచారం చేరవేసేలా ఎంఈవోలు, హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలని సూచించారు.

విజయగణపతికి దీపాల సేవ



విజయగణపతికి అష్టోత్తర శత దీపాల సేవ

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయంలో బుధవారం అష్టోత్తర శత దీపాల సేవ నిర్వహించారు. అర్చకులు పెంట నగేష్‌శర్మ, శ్రీధర్‌శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న జీఎస్టీ డిప్యూటీ కమిషనర్



శైలజారాణికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర వస్తుసేవల పన్ను(జీఎస్టీ) విభాగ డిప్యూటీ కమిషనర్ శైలజారాణి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాశరావు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి సూర్యనారాయణస్వామివారి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటల నుంచి ఆలయ అనివెట్టి మండపంలో జరుగుతుందని ఈవో వి.హరిసూర్యప్రకాశ్ తెలిపారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో పాటు గ్రామ పెద్దల పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని, రామతీర్థం దేవస్థానం ఈవో కిషోర్‌కుమార్ పర్యవేక్షించనున్నారని పేర్కొన్నారు.





విజయనగరం జిల్లా భోగాపురంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ విమానాశ్రయ శంకుస్థాపన సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు

జాబ్ అని నమ్మితే.. జేబు ఖాళీయే..!



ఇలాంటి ఆఫర్స్‌ను నమ్మవద్దు..



పార్ట్‌టైం జాబ్స్, వర్క్ ఫ్రం హోమ్ అంటూ నమ్మబలికేవారి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి. తెలియని లింక్స్ క్లిక్ చేయడం, తెలియనివారితో టెలిగ్రామ్, వాట్సాప్ వంటి యాప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని ఇలాంటి ఆఫర్స్ నమ్మి డబ్బులు పంపించకూడదు.

– జి.ఆర్.రాధిక, ఎస్పీ

- వర్క్ ఫ్రం హోమ్, పార్ట్‌టైం జాబ్ అంటూ మోసగిస్తున్న కేటుగాళ్లు
- వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా ఫోన్లకు లింకులు
- అత్యాశకు పోయి సైబర్ వలలో చిక్కుకుంటున్న యువత
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : మీరు ఎక్కడికీ వెళ్లకుండా సులువుగా ఇంటి వద్దే ఉంటూ జాబ్ చేయండి.. ప్రతి నెలా వేలాది రూపాయలు సంపాదించండి.. వర్క్ ఫ్రం హోమ్.. పార్ట్‌టైం జాబ్ చేస్తూ లక్షలు సంపాదించండి.. ఇందుకు చేయాల్సిందల్లా కింద ఉన్న లింక్ క్లిక్ చేయడమే.. ఈ తరహా మెసేజులు నమ్మి మోసపోతున్న వారి సంఖ్య జిల్లాలో ప్రతి నెలా పెరుగుతోంది. ఉద్యోగం అంటే ఎవరికైనా ఆశే. సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశకుపోయిన యువకులు సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కుకొని మోసపోతున్నారు.

ఫోన్‌ల ద్వారా వారు పంపించే సాధారణ, వాట్సాప్, టెలిగ్రామ్ సందేశాల్లోని లింక్‌లు ఓపెన్ చేసి వారు చెప్పిందల్లా చేసి బ్యాంకు ఖాతాల నుంచి సొమ్మును యూపీఐ, గూగుల్‌పే, ఫోన్‌పే తదితరాల ద్వారా ట్రాంజెక్షన్ చేసి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. నిన్నటికి నిన్న కొత్తూరు మండలవాసి రూ.1.94 లక్షలు ఇలా నమ్మి మోసపోయారు. 2022లో ఈ తరహా కేసులు జిల్లాలో మూడు నమోదు కాగా.. ఈ ఏడాది నాలుగు నెలల వ్యవధిలోనే మూడు కేసులు నమోదు కావడం గమనార్హం. మొత్తంగా బాధితుల వద్ద నుంచి రూ.20 లక్షల వరకు సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. వర్క్‌ఫ్రం హోం, పార్ట్ టైం జాబ్‌లంటూ ఎవరైనా నమ్మబలికినా యువత మోసపోకూడదని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు ఉన్నతాధికారులు సూచిస్తున్నారు..

కొన్ని ఘటనలు పరిశీలిస్తే..

- 2022లో జె.ఆర్.పురం పీఏస్ పరిధిలో రూ.1,19,000, లావేరు పీఏస్ పరిధిలో రూ.4,55,000, టెక్కలి పీఏస్‌పరిధిలో రూ. 1,80,000లు సైబర్ నేరగాళ్లు యువకుల బ్యాంకు ఖాతాల నుంచి దోచుకున్నారు.
- 2023లో పోలాకి పీఏస్ పరిధిలో జనవరి 23న రూ.25,000, ఎచ్చెర్ల పీఏస్ పరిధిలో ఫిబ్రవరిలో రూ.10,23,000. ఈ నెల(మే) 1న కొత్తూరు పీఏస్ పరిధిలో రూ.1,94,000 మోసపోయామంటూ ఫిర్యాదులు చేశారు.

సైబర్ అలర్ట్

చిక్కుకునేది చదువుకున్న వారే..

ముంబైలోని ఓ కంపెనీ తరఫున ప్రాజెక్టు మేనేజరుగా ఉన్న ఆయన కొత్తూరులో వర్క్‌ఫ్రం హోమ్ విధులు నిర్వర్తిస్తూ ఇలాంటి ఉచ్చులో చిక్కుకున్నాడు. ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న మరో ఆయన ఎచ్చెర్ల పీఏస్ పరిధిలో మోసపోయాడు.. ఇలా చెప్పుకుంటూ పోతే అంతా చదువుకున్నవాళ్లే..

తొందరగా ఫిర్యాదు చేస్తే మేలు..

ఇలాంటి నేరాలు జరిగేటప్పుడు తక్షణమే 1930కు డయల్ చేసి ఫిర్యాదు చేస్తే మంచిది. వారి అకౌంట్లు బ్యాంకు వారు ఫ్రీజ్ చేస్తారు. ఖాతా నంబర్లు, ఏటీఎం పిన్ నంబర్లు అన్నీ బ్లాకులో పెడతారు. నిందితులు, వారి అకౌంట్లు ట్రేస్ అయ్యాక విచారణ పూర్తి చేసి వారి వద్ద సొమ్ము రికవరీ చేసి వీరికి జమ చేస్తారు. (కొత్తూరు బాధితుడు మూడు అకౌంట్లలో 77,000 (ఐసీఐసీఐ), 45,000 (సిటీ బ్యాంకు), 72,000(హెచ్‌డీఎఫ్‌సీ) పంపించాడు. ఐసీఐసీఐ బ్యాంకు వారు పంపించిన అమౌంట్‌ను మరలా క్రెడిట్ చేసి అవి వాడుకోవడానికి లేకుండా ఫ్రీజ్ చేశారు.

మోసం చేస్తారిలా..

ఫోన్‌కు సాధారణ సందేశాల ద్వారా కొన్ని లింక్‌లను పంపిస్తారు. అవి తెలియకుండానే మనం ఓపెన్ చేస్తాం. ఆ లింకుల్లో అర్జెంట్ ఓపెనింగ్ ఫర్ జాబ్ ఇంటర్వ్యూ, యూ కెన్ వర్క్ ఫ్రం హోం సేలరీ అప్ టు రూ.18,000. మినిమమ్ 2 మంత్స్ ఎక్స్‌పీరియన్స్, కాల్ ఆర్ క్లిక్ .. అంటూ ఓ లింక్ పంపుతారు. ఆ లింకులోనే ఫోన్ నెంబరు ఉంటుంది. మనం ఫోన్ చేసినా.. ఆ లింక్ ఓపెన్ చేసినా.. ఇక అంతే.. వారు లైన్లోకి వచ్చి మీరు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంటేషన్ ఫీజు అంటూ దఫదఫాలుగా మీకు శఠగోపం పెట్టేస్తారు.

- మరికొందరు ఆ లింక్ నుంచి ఎనీడెస్క్ యాప్ ద్వారా మన బ్యాంకు ఖాతాలు, యూపీఐ పిన్‌లు, ఎమ్‌పిన్‌లు తదితర డేటా అంతా చోరీ చేసి సొమ్మును ఖాళీ చేస్తారు.
- టెలిగ్రామ్ యాప్ ద్వారా వర్క్ ఫ్రం హోం అంటూ.. ఎక్కువ మందితో గ్రూపు క్రియేట్ చేసి.. నాలుగైదు టాస్క్‌ల ద్వారా అమౌంటును పంపిస్తే అదనంగా ఒకేసారి ఎక్కువ మొత్తంలో సెటిల్ చేస్తామని చెబుతారు.



మనల్ని నమ్మించడానికి గ్రూపులో వాళ్లు పంపిన అమౌంట్, వారికి అదనంగా వచ్చిన క్రెడిట్ అమౌంట్‌లు స్క్రీన్ షాట్‌లు గ్రూప్ హిస్టరీలో పెడతారు. టాస్క్‌లు పూర్తిచేయకుండా మధ్యలో ఆగిపోతే అమౌంట్ రీఫండ్ చేయమని ముందుగా కండిషన్ పెడతారు. మొదట ఓ రూ. 2 వేలు పంపించామనుకోండి.. రూ.2,800 మన ఖాతాలో క్రెడిట్ చేస్తారు. తర్వాత మరో ఐదు వేలు అంటారు. కానీ రిటర్న్ క్రెడిట్ చేయరు. ఏమని అడిగితే టాస్క్‌లు పూర్తవ్వాలంటారు. రూ. 28 వేలు, రూ.65 వేలు, రూ.1.45లక్షలు.. ఇలా పెంచుకుంటూ పోతారు. తీరా అమౌంట్ పంపించేశాక గ్రూప్‌లో హిస్టరీ రిమూవ్ చేసేస్తారు. మన ఫోన్ నెంబర్ బ్లాక్ చేస్తారు. వారితో కమ్యూనికేషన్ ఉండదు. అప్పటికి గాని మనకు అర్థమవ్వదు మోసపోయామని.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో.. ఉచిత సంగీత శిక్షణ

- నేటి నుంచి 25 రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరం
- ఐదేళ్లు దాటిన చిన్నారులు అర్హులు



శ్రీకాకుళం కల్చరల్: వేసవి సెలవుల్లో పిల్లలను బంధువుల ఇళ్లకు పంపడం, దర్శనీయ స్థలాలకు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడం సహజం. అయితే సెలవులను సరదాగా గడిపేస్తే ప్రయోజనం ఉండదు. చక్కటి ప్రణాళికతో ఆలోచిస్తే సెలవులు సద్వినియోగమవుతాయి. పిల్లల అభిరుచి మేరకు ప్రత్యేక శిక్షణ అందించాలి. ఈ క్రమంలోనే చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్, సాక్షి మీడియా గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 30 వరకు ఉచిత సంగీత శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, నటుకుల మోహన్ తెలిపారు. సంగీత గురువు పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ఏడాదిగా చదువులతో కుస్తీలు పట్టే విద్యార్థులకు ఈ వేసవిలో తమ ప్రతిభకు మెరుగులు పెట్టేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదని చెప్పారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. 5 ఏళ్లు దాటిన పిల్లలు అర్హులని పేర్కొన్నారు. ప్రాథమిక అంశాలను మాత్రమే నేర్పుతామని చెప్పారు. పూర్తి వివరాలకు 94410 72761 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వసతిగృహాలపై నమ్మకం కల్పించండి

- వార్డెన్ల సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వసతి గృహ అధికారులు (వార్డెన్లు) సమయపాలన పాటించాలని, హాస్టళ్లపై తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ వసతి గృహ అధికారులతో జాతీయ ఆహార భద్రత చట్టం–2013పై సమీక్ష నిర్వహించారు. వసతి గృహాల్లో చేపడుతున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు మంచి భోజనంతో పాటు మెరుగైన విద్య అందించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 3 నాటికి వసతి గృహాల వాటర్ ట్యాంక్‌లు పూర్తి స్థాయిలో శుభ్రపరచి ఫొటోలతో సహా నివేదికలు సమర్పించాలన్నారు. విద్యార్థులకు మంచి ఆహారం అందించేలా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు బాధ్యత వహించాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం వసతి గృహాల్లో చేపడుతున్న పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్మీడియెట్ ఫలితాలపై వసతి గృహాల వారీగా సమీక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన టెక్కలి, పొందూరు కళాశాలల బాలికల వసతి గృహాల అధికారులను అభినందించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి ఆర్.గడ్డెమ్మ, శ్రీకాకుళం, పలాస సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ అయ్యేలా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. బుధవారం తన కార్యాలయంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు, జడ్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వాహన ప్రమాద కేసుల్లో కక్షిదారులకు సత్వరమే న్యాయం అందడానికి లోక్ అదాలత్ మంచి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో ఎస్పీ లు రాధిక, విక్రాంత్ పాటిల్, జిల్లా ఫ్యామిలీ కోర్టు అదనపు జిల్లా జడ్జి భాస్కరరావు, ఎస్సీ, ఎస్టీ కోర్టు అదనపు జిల్లా జడ్జి ఫణికుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనూరాధ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, ప్రభుత్వ న్యాయవాది వినయ్ భూషణ్‌రావు, స్టాండింగ్ కౌన్సిల్స్ లక్ష్మి, మంచు జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజుల చెల్లింపు గడువు ప్రభుత్వం ఒకరోజు పెంచింది. వాస్తవానికి మే 3తో గడువు ముగియగా 4వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ఇంటర్మీడియెట్ బోర్డు నిర్ణయం తీసుకుందని జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు బుధవారం తెలిపారు. ఫెయిలైన అభ్యర్థులతో పాటు బెటర్‌మెంట్ రాయదలచుకున్న వారు గడువులోగా కళాశాలల్లో ఫీజు చెల్లించాలని సూచించారు.

కుప్పకూలిన బాహుదా వంతెన

- గ్రానైట్ లారీ వెళ్తుండగా ఘటన
- స్వల్ప గాయాలతో బయటపడిన డ్రైవర్, క్లీనర్
- తప్పిన పెను ప్రమాదం
- నిలిచిపోయిన రాకపోకలు



ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



కూలిన బాహుదానది వంతెన

ఇచ్ఛాపురం రూరల్/ఇచ్ఛాపురం: రాత్రంతా ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల్లో గడిపిన ప్రజలు బుధవారం ఉదయం 5 గంటల సమయంలో బాహుదానదిలో స్నానం చేసేందుకు వస్తున్న వేళ.. ఒకటి, రెండు వాహనాలు వంతెనపై ప్రయాణిస్తున్న సమయంలో పెద్దగా శబ్దం చేస్తూ ఉన్నపళంగా వంతెన కూలిపోవడంతో ఆ దృశ్యాన్ని చూసిన వారంతా పరుగులు తీశారు. సుమారు 20 అడుగుల లోతులో గ్రానైట్ లోడుతో భారీ వాహనం. అందులోని డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటకు రావడంతో అక్కడి వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

పరిమితికి మించి ప్రయాణం..

1929 ఫిబ్రవరి 5న అప్పటి మద్రాసు గవర్నరు ఇచ్ఛాపురంలో ఈ వంతెన ప్రారంభించారు. బ్రిటీష్ హయాం నుంచి శ్రీరామచంద్ర మహరాజ్‌గా పిలిచే ఈ వంతెన ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలకు వారధిగా సేవలు అందిస్తోంది. 30 టన్నుల మేరకు మాత్రమే పరిమితి కలిగిన ఈ వంతెనపై టన్నుల కొద్దీ భారీ లోడులతో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. బుధవారం ఉదయం ఏపీ 27 యుబి 2304 నంబరు గల లారీ ఒడిశాలోని అస్కా క్వారీ నుంచి ఒంగోలు జిల్లాకు చెందిన ఓ టీడీపీ మాజీ మంత్రికి చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీకి వెళ్తోంది. సుమారు 70 టన్నుల బరువు గల సామర్థ్యంతో వెళ్లిన ఈ భారీ లారీ బరువుకు తట్టుకోలేని వంతెన ముందు భాగం కుప్పకూలిపోయింది. దీంతో లారీ 20 అడుగుల లోతులో పడిపోయింది. ఆ సమయంలో వంతెనపై మరే ఇతర వాహనాలు ప్రయాణించకపోవడంతో ఘోర ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

నిలిచిన రాకపోకలు..

ఆంధ్రా–ఒడిశా సరిహద్దు వంతెన కావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. రూరల్ ఎస్ఐ వి.రమేష్ వాహనాలను జాతీయ రహదారిపై నుంచి బెల్లుపడ మీదుగా ఇచ్ఛాపురంలోకి మళ్లించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న పిరియా సాయిరాజ్, విజయ

వంతెన కూలిన విషయాన్ని తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో మాట్లాడారు. ప్రస్తుతం ఇచ్ఛాపురం పట్టణంలో స్వేచ్ఛావతి ఉత్సవ సంబరాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నయ ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని కోరారు. శాశ్వత వంతెన నిర్మాణానికి సుమారు రూ.13 కోట్లు వరకు ఖర్చవుతుందని, ప్రస్తుతానికి ప్రత్యామ్నయ ఏర్పాట్లకు రూ.40 లక్షలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. వెంటనే అంచనా తయారీ చేసి నివేదికను సమర్పించాలని ఆర్‌అండ్‌బీ డీఈ రామనాయుడుకు సూచించారు. నేషనల్ హైవే మెయింటెనెన్స్ అధికారితో మాట్లాడిన సమన్వయకర్త సాయిరాజ్ ఈదుపురం–బెల్లుపడ జంక్షన్ వద్ద యాక్సిడెంట్ జోన్ కావడం వల్ల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ నర్తు రామారావు, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డిలు ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు.

డ్రైవర్‌పై కేసు నమోదు..

పరిమితికి మించి వంతెనపై లారీని నడిపి, వంతెన కుప్పకూలే పరిస్థితికి కారణమైన లారీ డ్రైవర్ రాఘవేంద్రపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.రమేష్ తెలిపారు.

క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ పంచాయతీ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సీలాపు ప్రసాద్‌రెడ్డి, బి.రామారావులకు ఎంపీడీఓ గురువెల్లి ఉమాసుందరి బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల అవినీతిపై 'ఒక్కరోజు పనిచేయకుండా' అనే శీర్షికన ఇటీవల 'సాక్షి'లో వార్త ప్రచురితం కావడంతో ఎంపీడీఓ ఆధ్వర్యంలో విచారణ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన అక్రమాలు వాస్తవాలని తేలింది. అంతేకాక విచారణకు వచ్చిన అధికారులతో దురుసుగా ప్రవర్తించడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నివేదికలను కలెక్టర్‌కు, డ్వామా పీడీకు పంపించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

రికార్డుల నిర్వహణపై అసంతృప్తి



సిబ్బందికి సూచనలిస్తున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామ సచివాలయంలో సిబ్బంది రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. కార్యాలయ నిర్వహణ, కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని, బాలల హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా చూడాలని సూచించారు.

డీఆర్ఎం అనుమతితో రహదారుల నిర్మాణం



డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్

వజ్రపుకొత్తూరు: పూండి పీహెచ్‌సీ, శ్మశాన వాటికకు రహదారి నిర్మించుకునేందుకు వాల్తేరు డివిజినల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ సత్పతి అనుమతి ఇచ్చినట్లు జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి తెలిపారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావుతో కలిసి డీఆర్ఎంను కలిశారు. గోవిందపురంలో పీహెచ్‌సీకి, శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సహకారంతో జిల్లా పరిషత్ నిధులు రూ.8లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ స్థలం పైనుంచి గ్రావెల్ రోడ్డు నిర్మించేందుకు డీఆర్ఎం అనుమతి కోరారు. వెంటనే ఆయన అనుమతి ఇచ్చారు. దీంతో పాటు పూండి రైల్వే స్టేషన్‌లో ఇంటర్‌సిటీ, పూరీ- తిరుపతి, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు కల్పించాలని విన్నవించారు.

చల్లబడిన సిక్కోలు



ఆమదాలవలసలో రహదారిపై పారుతున్న వర్షపునీరు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల ఎండ, ఉక్కపోతతో వేడెక్కిన సిక్కోలు బుధవారం కురిసిన వర్షాలతో చల్లబడింది. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురవగా శ్రీకాకుళం, పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళ భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,640-00
బంగారం(22సి. 10గ్రా.)	56,500-00
వెండి (కిలో)	81,800-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 445.00
విజయనగరం	రూ. 449.00
శ్రీకాకుళం	రూ. 449.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250

జీవనదం.. సిక్కోలు జానపదం

- అనేక కళారూపాలకు పుట్టినిల్లు శ్రీకాకుళం
- రంగోయి కేంద్రంగా కళల ప్రోత్సాహం
- ఉద్దానంలో ఏటా జానపద జాతరలు

పలాస: జానపదం పల్లె ప్రజల జ్ఞానపథం. కళామతల్లి ముద్దు బిడ్డలు ఈ నేల నుంచే నలుచెరుగులా ఈ పాటను వినిపించారు. నడిపించారు. ఇక్కడి జంగాలు కథలే ప్రముఖ బుర్రకథ పితామహుడు నాజర్‌కు బుర్రకథ అయింది. తెల్లోడిని గడగడలాడించిన గరిమెళ్ల 'మాకొద్దీ తెల్లదొరతనం' పాట ఇక్కడి గంగిరెద్దుల వాళ్లు పాడు కున్న 'దేవా...చిన్న చిన్న మీసాలాయే' పాట నుంచి పుట్టిందే. విప్లకవి సుబ్బారావు పాణిగ్రాహి శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటం సందర్భంగా రాసిన జముకుల కథ.. మన బోనెల అసిరయ్యలాంటి ఎంతో మంది కళాకారులు పాడుకునే బోనెల పాట(బుడబుక్కలపాట) నుంచే పుట్టింది. నారుమడిలో పాలికేక పాటే పోరాటాలకు తొలికేక అయింది. జానపదం తన రూపాన్ని ఆయా కాలాలకు అనుగుణంగా రూపాంతరం చెందుతునే నేడు ఈ కళలను కొందరు ఇంకా సజీవంగా ఉంచుతున్నారు. ఎన్ని సాంకేతిక విప్లవాలు వచ్చినా గ్రామాల్లో ఈ కళలను ప్రజలు ఆదరిస్తున్నారు.

ఈ నేల ఓ ఊట బావి..

ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా జానపద ఆట పాటలకు నిలయం. ఇక్కడ ఎన్నో కళారూపాలు ఉన్నాయి. తోలు బొమ్మలాట, జముకుల పాట, తప్పెటగుళ్ల, తూర్పుభాగవతం, గంగిరెద్దులాట, బుడిగె జంగాలు, మాలదాసర్లు, ఎరుకులపాటలు, గంటసాయిబులు, చెక్కభజన, కోలాటం, పండరిభజన, బుట్టబొమ్మలు, చెంచుపాటలు, డప్పుకళాకారులు, పాములాట, అంజాట, గిరిజన జానపద కళలైన థింసా, ఉద్దానం ప్రాంతంలో అత్తా అల్లుడు సంవాదం, హరిదాసర్ల కీర్తనలు, మత్స్యకారుల జాలరి పాటలు.. ఇలా ఎన్నో అలరిస్తాయి. ఈ కళారూపాలను ఇప్పుడిప్పుడే వెలుగులోకి తీసుకొస్తూ వాటిని భద్రపరుస్తున్నారు.

కళల్ని కాపాడుతున్నారు..

పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన గురుకుల పాఠశాలలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న బద్రి కూర్మారావు ఉత్తరాంధ్ర జానపద కళలపై పరిశోధన పుస్తకాన్ని తీసుకొచ్చారు. ఇదే గ్రామంలో 20ఏళ్లుగా సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏటా గిడుగు రామూర్తి తెలుగు భాషా, జానపద కళాపీఠం ఆధ్వర్యంలో జానపద కళాజాతర వైభవంగా నిర్వహిస్తున్నారు. జిల్లాకు చెందిన వృత్తి కళాకారులను ఇక్కడికి రప్పించి ప్రదర్శనలు ఇప్పించడం, వారిని తగిన విధంగా గౌరవిస్తున్నారు. సిక్కోలు జానపద కళాజాతర పేరుతో ఉద్దానం ప్రాంతానికి చెందిన కొంత మంది కళాకారులు ఏటా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉద్దానం సాహితీ సాంస్కృతి వేదిక ఆధ్వర్యంలో కాశీబుగ్గ కేంద్రంగా జానపద కళాకారులను ఆహ్వానించి ప్రదర్శనలు చేయిస్తున్నారు. ఇటీవల కాశీబుగ్గలో ఉత్తరాంధ్ర రచయితల మహాసభలు జరిగాయి. జయధీర్ తిరుమలరావు, అందెశ్రీ వంటి కవులు, రచయితలు పాల్గొని సిక్కోలు జానపద సంపదను కాపాడుకొని భావితరాలకు అందివ్వాలని వారు సూచించారు.



పలాస మండలం రేగులపాడు తప్పెటగుళ్ల ప్రదర్శన



ఉద్దానంలో అమ్మోరు వేషం



బోనెల పాట


జానపద సంపదను కాపాడుకోవాలి



శ్రీకాకుళం జిల్లాలో అపారమైన జానపద సంపద ఉంది. దాన్ని రెండు పుస్తకాల్లో పొందుపరిచాను. ఉత్తరాంధ్ర జానపద కళలు, ఉత్తరాంధ్ర జాన పద గేయాలు పుస్తకాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. ఇంకా కృషి చేయాల్సి ఉంది. పాఠ్యపుస్తకాల్లో జానపద కళలు అనే అంశాన్ని పొందుపరచాల్సిన అవసరం ఉంది.

– బద్రి కూర్మారావు, ప్రభుత్వ గురుకుల పాఠశాల అధ్యాపకుడు, రంగోయి, పలాస మండలం

తొలిఅడుగులే జానపదం



ఆదిమానవుడి తొలి అడుగుల చప్పుడే జానపదం. అప్పుడే ప్రారంభమైంది. జనం మెచ్చిన ఆటా పాట జానపదం. సామాన్యుడిని సైతం మైమరిపించే పాట ఏదైనా ఉందంటే జానపదాలు మాత్రమే. ఆటా, పాట, మాట మూడింటితో జనహృదయాలను రంజింపజేస్తాయి. ప్రభుత్వాలు కూడా వీటిని ప్రోత్సహించాలి.

– డాక్టరు కుమార్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ జానపదకళాకారుల సంఘం, విజయవాడ

విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకం



ప్లేస్‌మెంట్ ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకమని సెట్‌శ్రీ సీఈవో ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఉద్యోగ విజయోత్సవ వేడుక నిర్వహించి ప్లేస్‌మెంట్లను సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉద్యోగ నియామక ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మేధా, ఎం.నాగలక్ష్మి, టి.రాజశేఖర్, ఎల్.తరుణ్, పి.భవానీ, బి.ఆర్యా, కె.దుర్గా సాయిరాం, కె.తరుణ్‌సాయి, ఎస్.ఉదయ్‌కిరణ్‌లు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. వార్షిక వేతనం రూ.3 లక్షలు నుంచి రూ.2.4 లక్షలు లభించనుంది. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రారంభంలో తక్కువ వేతనం లభించినా నైపుణ్యం, అనుభవం ఆధారంగా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. డిప్లమా కోర్సులో చేరినప్పటి నుంచి ప్రయోగాత్మక విద్యకు, ఇంటర్న్‌షిప్‌కు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు మాట్లాడుతూ శతశాతం ఉపాధి లక్ష్యంగా పాలిటెక్నిక్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ ప్లేస్‌మెంట్ల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ దారుణం



నిరసన వ్యక్తం చేస్తున్న బొడ్డేపల్లి సత్యవతి, నాయకులు

శ్రీకాకుళం అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడం దారుణమని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక, అఖిల పక్షాల నిరసనకు మద్దతుగా పీసీసీ పిలుపుమేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటు వ్యక్తులకు అమ్మేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, బస్వా షణ్ముఖరావు, కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, లఖినేని సునీల్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, ఏఎస్ఆర్ జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకుల కోసం ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 4 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 7993340407, 9553410809 నంబర్లుకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం కావాలి

- అధికారులకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్(సరిహద్దు రాళ్ల ఏర్పాటు), ఈకేవైసీ మరింత వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. సంయుక్త కలెక్టర్, సబ్ కలెక్టర్లు, ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే, ఈకేవైసీ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. వీటినంత త్వరగా పనులు పూర్తిచేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రణస్థలంలో రీసర్వే సక్రమంగా జరగకపోవడంపై విమర్శలు వస్తున్నాయని, అందుకు గల కారణాలను కోరగా తహసీల్దార్ వివరించారు. పనుల్లో ఒక రోజు ఆలస్యం జరిగినా పర్వాలేదని, ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. స్టోన్ ప్లాంటేషన్ గతంలో వేగవంతంగా చేసినప్పటికీ, మరలా వెనుకంజలో చేరిందన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 3 లక్షల 33 వేల 649 స్టోన్ హద్దురాళ్ల ఏర్పాటు పూర్తయ్యిందన్నారు. మరో లక్ష రాళ్లు ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు. పెండింగ్ పనులను ఈ నెల 18 నాటికి పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డుల సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, ఆర్‌డీఓలు బి.శాంతి, సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పండగకు వచ్చి వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి
- తిమడాంలో విషాదఛాయలు



ఘటనపై ఆరా తీస్తున్న ఎస్‌ఐ సింహాచలం



నరసన్నపేట: గడ్డెయ్యపేట కూడలి సమీపంలో మందాలమ్మ గుడి వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలం తిమడాంకు చెందిన కింజరాపు సావిత్రి (36) మృతి చెందింది. జమ్ములో గ్రామదేవత పండగకు వచ్చి బంధువుల ఇంట్లో భోజనం అనంతరం సమీప బంధువుతో కలిసి స్కూటీపై స్వగ్రామం తిమడాంకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎదురుగా వేగంగా వస్తున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అయితే ప్రమాదానికి కారణమైన ఆటో వెళ్లిపోవడంతో పోలీసులు ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనం వెనక కూర్చున్న సావిత్రి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈమె రోజు వారీ కూలీ. భర్త శిమ్మయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు వెంకటసాయి, ప్రియా ఆనంద్ ఉన్నారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే తిమడాంలో విషాదం అలుముకుంది. ఘటనా స్థలాన్ని నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం పరిశీలించారు. స్కూటీ నడిపిన వ్యక్తిని విచారించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

డీఎస్పీలకు ఆత్మీయ వీడ్కోలు



డీఎస్పీ మహేంద్రమాతేకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో మూడేళ్లకు పైగా విశిష్ట సేవలందించి సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్తున్న శ్రీకాకుళం, టెక్కలి సబ్ డివిజనల్ కార్యాలయాల డీఎస్పీలు మహేంద్ర మాతే, ఎం.శివరామరెడ్డిలకు జిల్లా పోలీసు యంత్రాంగం ఆత్మీయ వీడ్కోలు పలికింది. బుధవారం రాత్రి ఓ ఫంక్షన్ హాల్లో ఎస్పీ జి.ఆర్.రాధిక అధ్యక్షతన జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో పోలీసు యంత్రాంగం ఘనంగా వీరిని సన్మానించింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చక్కని సమన్వయంతో అన్ని విధాలా సహాయసహకారాలు అందించారని, అప్పగించిన ఏ పనైనా బాధ్యతతో పూర్తిచేసేవారని కొనియాడారు. భవిష్యత్తులో ఉద్యోగోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం డీఎస్పీలు మాట్లాడుతూ ఎస్పీ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన సహాయ సహకారాలతో అనేక కేసులు ఛేదించామన్నారు. కోవిడ్ సమయంలోనూ సమర్థంగా విధులు నిర్వర్తించామని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సెబ్ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.మణికంఠ, అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు వై.శృతి, ఎస్.వాసుదేవ్, సీహెచ్ జీవీ.ప్రసాద్, జి.శ్రీనివాసరావు, పరిపాలనాధికారి శివరామరాజు, ఎస్.బాలరాజు, పలువురు సీఐలు, ఆర్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

నూజివీడు : ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఉంటున్న శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీకి చెందిన వి.రాకేష్(21) బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సాయంత్రం 6.30 గంటల సమయంలో రాకేష్ తోటి విద్యార్థులతో ఈ2 వసతి గృహంలోని తన గదికి వెళ్తానే ఒక్కసారిగా సెకండ్ ఫ్లోర్ నుంచి కిందకు దూకాడు. దీంతో అతనిని వెంటనే ట్రిపుల్ ఐటీ ఆవరణలోనే ఉన్న ఆసుపత్రికి, అక్కడి నుంచి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. రాకేష్‌ది విజయనగరం జిల్లాలోని గొలిజం స్వగ్రామం. మూడు రోజులుగా అతను ముభావంగా ఉంటున్నాడని తోటి విద్యార్థులు ఫ్యాకల్టీకి చెప్పడంతో మంగళవారం రెండు గంటల సేపు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈనెల 4న విద్యార్థులందరూ ఇంటికి వెళ్తుండగా, ఇంతలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు.

సీఎం కృషితో మెరుగైన ఉపాధి అవకాశాలు

- పొందూరులో టీడీపీ రౌడీ రాజకీయాలు మానేయాలి
- స్పీకర్ తమ్మినేని సీతారాం



నూతన మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: ఉత్తరాంధ్రలో వలసలను నివారించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరులో నూతన మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగానే సుజల స్రవంతి ద్వారా పోలవరం సాగునీరు, భోగాపురంలో అతిపెద్ద విమానాశ్రయం ఏర్పాటుకు భూమి పూజ , తీరప్రాంతాల్లో పోర్టు నిర్మాణాలకు శంకుస్థాపనలు, నేరడిలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు, నదులు అనుసంధానం, ఇంటింటికి కుళాయిల ఏర్పాటు చేయడం వంటి బృహత్తర కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. 2017లో పొందూరు మండల పరిషత్ కార్యాలయం మంజూరుకాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక 2019లో పూర్తి చేశారని గుర్తు చేశారు. మొత్తం నిధులన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అందజేసిందని చెప్పారు. 2017లో మంజూరు చేసినంత మాత్రాన టీడీపీ నాయకులు సెల్ఫీలు తీసుకుని ఛాలెంజ్‌లు విసురుతారా? అని ప్రశ్నించారు. పొందూరు మండలంలో రౌడీ రాజకీయాలు, గూండాయిజం చేయడం, అప్పనంగా భూములను నొక్కేయడం, మాఫియాను నడిపించడం ఆపేయాలన్నారు. అధికారులను, ఉద్యోగులను బెదిరించడం మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, మరో నాయకుడు గిరి భూములు ఆక్రమించారని, కావాలంటే అక్కడ సెల్ఫీలు తీసుకోవాలన్నారు. వీఆర్‌గూడెం క్వారీలో అన్యాయంగా విద్యార్థి మణికంఠని చంపేశారని మండిపడ్డారు. వెన్నెలవలసలో పూలసాగు పేరుతో అప్పనంగా భూమిని నొక్కేయాలనుకున్నా జరగనివ్వలేదన్నారు. ప్రస్తుతం అక్కడ లెదర్‌పార్కు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నానని తెలిపారు. నియోజకవర్గంలో తాను మరోసారి ఎమ్మెల్యేగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేంద్రమాజీ మంత్రి కిల్లి కృపారాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ రేగిడి లక్ష్మి, నాయకులు కొండాడ రమణమూర్తి, బాడాన సునీల్, గాడు నాగరాజు, జేవీఆర్, అనకపల్లి గోవింద, వండాన శ్రీదేవి, కాకర్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



భరత్‌కుమార్ మృతదేహం

లావేరు: మండలంలోని బుడుమూరు వద్ద బుధవారం ఉదయం విశాఖపట్నం జిల్లా మధురవాడకు చెందిన గేదేల భరత్ కుమార్(27) అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురవాడకు చెందిన భరత్ కుమార్ మంగళవారం రాత్రి స్నేహితులతో కలిసి శ్రీకాకుళం వచ్చాడు. తనకు పని ఉందని మధురవాడ వెళ్లిపోతానని చెప్పడంతో స్నేహితులు శ్రీకాకుళంలో బుధవారం వేకువజామున ప్రైవేటు బస్సు ఎక్కించారు. ఇంతలో ఏం జరిగిందో గానీ లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయరహదారిపై భరత్‌కుమార్ అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న లావేరు పోలీసులు భరత్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. భరత్‌కుమార్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. లావేరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఓ యాచకుడు మృతి చెందినట్లు ఆర్టీసీ కాంప్లెక్సు మేనేజరు లుకలాపు సన్యాసినాయుడు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని రెండో పట్టణ సీఐ సన్యాసినాయుడు తెలిపారు. ఈయన కొంతకాలంగా కాంప్లెక్సు పరిధిలో యాచన చేస్తున్నాడని, ప్లాట్‌ఫాం నంబరు-20 వద్ద బుధవారం సాయంత్రం మృతి చెందాడని తెలుసుకుని పరిశీలించామని, 40-45 ఏళ్ల వయసు ఉంటుందని చెప్పారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు మృతునిది ఆమదాలవలసలోని బ్రాహ్మణ కుటుంబమని భావించి సదరు వ్యక్తులకు సమాచారం అందించామని, వారు వచ్చి గుర్తించాల్సి ఉందని సీఐ చెప్పారు.

చైన్‌స్నాచింగ్ కలకలం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాతటెక్కలిలో చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. ఓ మహిళ తన మెడలోని బంగారం గొలుసు తెంపేందుకు ప్రయత్నించిందంటూ గ్రామంలోని దమ్మలవీధికి చెందిన ఓ వివాహిత కేకలు వేసింది. వెంటనే వెంబడించిన గ్రామస్తులు సదరు మహిళను పట్టుకుని నిలదీసి దాడికి యత్నించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఆమెతోపాటు మరో మహిళను అదుపులోకి తీసుకుని వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఇద్దరి మహిళల నుంచి వేలిముద్రలు తీసుకుని కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయంలో పరిశీలించారు. వీరికి ఎటువంటి నేరచరిత్ర లేనట్లు గుర్తించారు. జుత్తుకు తోపేలాలు అమ్మే వారిపై గ్రామస్తులు అనుమానంతో దాడి చేశారని, మహిళ మెడలో గొలుసు లాగినట్లు ఎలాంటి ఆనవాల్లు లేవని వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ వై. మధుసూదనరావు తెలిపారు. ఎక్కడైనా అనుమానితులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, ముందుగానే దాడికి పాల్పడవద్దని సూచించారు.